

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మ పథం కార్యక్రమంలో భాగంగా సోమ వారం నిత్యకళావేదికపై మార్కాపురానికి చెందిన శ్వేత నాట్య అకాడమీ వారి నృత్యం ఆకట్టుకుంది.



మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు వెండి రథోత్సవం చేపట్టారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.91
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.421
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 29,516
అవుట్ ఫ్లో	: 29,336

న్యూస్‌రీల్

మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి



కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉల్లి పోటెత్తింది. గతంలో ఎపుడూ లేని విధంగా సోమవారం రికార్డు స్థాయిలో 13,070 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు మార్కెట్‌కు వచ్చాయి. 404 మంది రైతులు ఉల్లిగడ్డలను మార్కెట్‌కు తెచ్చారు. ఉల్లి ధరలు కూడ క్రమంగా పెరుగుతున్నాయి. గత నెల 30వ తేదీన అత్యధికంగా 12,611 క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. తాజాగా 13 వేలకుపైగా క్వింటాళ్ల ఉల్లి రావడంతో మార్కెట్ ఘూటెక్కింది. క్వింటాలుకు కనిష్టంగా రూ.769, గరిష్టంగా రూ.4,389 లభించింది. సగటు ధర రూ.3,674 నమోదు అయింది. మోడల్ ధర మెరుగ్గా ఉండటంతో ఎక్కువ మంది రైతులకు రూ.3000 నుంచి రూ.4000 వరకు ధర లభించినట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్‌కు వచ్చిన ఉల్లి ప్రధానంగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ఎగుమతి అవుతోంది.

ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు గడువు పెంపు

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇవ్వనున్న ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు జే రంగ లక్ష్మీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ ప్రాతిపదికన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉచిత శిక్షణ పొందగోరు విద్యార్థులు జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లోని jnanabhumi.ap.gov.in చిరునామాలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ వెబ్‌సైట్‌లో అత్యంత సరళమైన రీతిలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగిసిన టెట్

కర్నూలు (సిటీ): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సోమవారంతో ముగిసింది. ఈనెల 3వ తేదీన ప్రారంభమైన టెట్ జిల్లాలో 6 కేంద్రాలు, హైదరాబాదులో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహించారు. చివరి రోజున ఉదయం సెషన్‌లో 1,504 మంది అభ్యర్థులకు గాను 1,323 మంది పరీక్షలకు హాజరు కాగా 181 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 394 మందికి గాను 291 మంది హాజరు కాగా, 103 మంది గైర్హాజరయ్యారు.

గ్రీన్‌కోలో జల విద్యుదుత్పత్తి విజయవంతం

ఓర్వకల్లు/పాణ్యం: కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుమ్మితం తండా వద్ద గ్రీన్‌కో సంస్థ చేపట్టిన ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఎనర్జీ పవర్ ప్రాజెక్టులో జల విద్యుదుత్పత్తి విజయవంతమైనట్లు అధికారులు తెలిపారు. దేశంలోనే అతిపెద్ద బహుళార్థక విద్యుత్ ఉత్పాదక పరిశ్రమను నెలకొల్పేందుకు గ్రీన్‌కో సంస్థ జిల్లాలో శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చలమశెట్టి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు హైడల్ విద్యుత్ ప్రాజెక్ట్ సంబంధించిన పిన్నాపురం జలాశయం నుంచి టన్నెళ్ల ద్వారా నీటిని విడుదల చేశారు. మొత్తం 7 టన్నెళ్లకు గానూ ప్రస్తుతం రెండు టన్నెళ్ల ద్వారా నీటిని కిందకు వదిలారు. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో సంస్థ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మిగతా 5 టన్నెళ్లను మరో రెండు నెలల్లో పూర్తి చేసేందుకు కంపెనీ యాజమాన్యం సిద్ధంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

నేడు కౌలుదారు చట్టంపై ప్రాంతీయ సదస్సు

కర్నూలు(అగ్రికల్చర్): నూతన కౌలుదారు చట్టాన్ని రూపొందించేందుకు ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలకు సంబంధించి మంగళవారం స్థానిక కర్నూలులోని ఉద్యాన భవన్‌లో ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతోనే వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం రూపొందిన చట్టాన్ని రద్దు చేసింది. కొత్తగా కౌలుదారుచట్టాన్ని రూపొందిస్తోంది. ఇందులో భాగంగా వివిధ వర్గాల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తీసుకునేందుకు ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తోంది. కర్నూలులో జరిగే ప్రాంతీయ సదస్సుకు కర్నూలు జిల్లా నుంచి 40 మంది, నంద్యాల, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల నుంచి 15 మంది ప్రకారం మొత్తం 85 మంది పాల్గొంటారు. కార్యక్రమంలో జేసీతో పాటు వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, కమిషనరేట్ నుంచి డీడీఏ పద్మావతి, ఏడీఏ గోపాల్‌పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో పాటు భూయజమానులు, కౌలుదారులు పాల్గొంటారని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.



ఆదోని పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

చంద్రన్న ఏలుబడిలో కష్టాల పాఠం!

నాడు విప్లవాత్మక మార్పులతో కళకళలాడిన సర్కారు బడులు నేడు కూటమి నేతల రాజకీయంతో మసకబారుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ అధ్వానంగా మారింది. మధ్యాహ్న భోజనంలో రుచి, శుచీ మాయమైంది. విద్యార్థుల దాహం తీర్చలేని పరిస్థితి నెలకొంది. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించే వారే లేరు. ఉపాధ్యాయుల సర్దుబాటు తూతూమంత్రంగా ఉండటంతో బోధన అస్తవ్యస్తమైంది. సమస్యల బడిలో కష్టాల పాఠాలు 'సాక్షి' పరిశీలనలో వెలుగు చూశాయి.– కర్నూలు సిటీ

- మితిమీరిన రాజకీయ జోక్యం
- గాడి తప్పుతున్న ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ
- ఇష్టారాజ్యంగా వంట ఏజెన్సీల మార్పు, ఆయాల తొలగింపు
- అస్తవ్యస్తంగా మధ్యాహ్న భోజన పథకం అమలు
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానం

కూటమి పాలనలో ఇదీ పరిస్థితి	మధ్యాహ్న భోజనం తీసుకోని విద్యార్థులు	వంట ఏజెన్సీల మార్పు	తొలగించిన ఆయాలు	ఏకోపాధ్యాయ పాఠశాలలు
	15,000	300	125	110
	1 – 9 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 15			

పేద విద్యార్థులు చదువుకునే సర్కారు బడులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక మార్పులను కూటమి సర్కారు అడ్డుకుంటోంది. రాజకీయ నేతల మితిమీరిన జోక్యంతో బడి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం బడుల నిర్వహణకు నిధులు విడుదల చేయకపోవడం, మరో వైపు అధికార దర్పంతో కూటమి నేతలు వంట ఏజెన్సీలను మార్చడం, ఆయాలను తొలగించడంతో సమస్యలు చుట్టుముడుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో చదువులు ముందుకు సాగడం లేదు. కర్నూలు జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన 2,251 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1,432 ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ప్రస్తుతం సరాసరిగా రోజుకు 1,75,000 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తీసుకుంటున్నారు. అయితే వంటలో రుచీ,శుచీ కరువై గతంలో కంటే 15 వేల మంది విద్యార్థులు భోజనాన్ని తీసుకోవడం మానేశారు. మెనూ సైతం చాలా స్కూళ్లలో అమలు కావడం లేదు. కూరగాయలు, వేరుశనక్కాయల ధరలు ఎక్కువగా ఉండడంతో చెట్నీలు, కూరలు వడ్డించడం లేదు. బియ్యం సైతం నాణ్యత లేకపోవడంతో సరిగా ఉడకక చాలా మంది భోజనం బాక్స్‌లను ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. కోడిగుడ్లు సరఫరా సక్రమంగా లేకపోవడం, ఉండాల్సిన సైజు కంటే చాలా తక్కువగా ఉంటున్నాయి. మరి కొన్ని చోట్ల చెడిపోయిన గుడ్లు సరఫరా చేస్తుండడంతో విద్యార్థులు పారవేస్తున్నారు. జిల్లాలో 3,996 వంట ఏజెన్సీలు ఉండగా ఇందులో ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల్లో 300 ఏజెన్సీలకు పైగా మార్పులు చేశారు. 1,699 మంది ఆయాలు స్కూళ్లలో టాయిలెట్లు శుభ్రం చేస్తుండగా రాజకీయ కారణాలతో సుమారు 125 మందిని తొలగించారు.



కోసిగి పాఠశాలలో ముద్దగా ఉన్న అన్నం, నీళ్ల సాంబారు

సాక్షి విజిట్

జిల్లాలో పాఠశాలలు విద్యార్థుల వివరాలు		
కేటగిరి	స్కూళ్లు	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	974	1,34,927
ప్రాథమికోన్నత	188	89,549
ఉన్నత	270	57,128
మొత్తం	1,432	2,81,604

ఉపాధ్యాయుల సర్దుబాటు, కొరత వివరాలు		
కేటగిరి	సర్దుబాటు	కొరత
ఎస్‌జీటీ	201	1360
స్కూల్ అసిస్టెంట్	55	1702
మొత్తం పోస్టులు	256	3,062



కామవరం పాఠశాలలో భోజనాన్ని పారవేస్తున్న విద్యార్థి

సమస్య మళ్లీ మొదటికి..

ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం 100 శాతం అన్ని స్కూళ్లలో టాయిలెట్లు నిర్మించి, గతంలో ఉన్న వాటికి మరమ్మతులు చేయించి రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించారు. కానీ టాయిలెట్ల వినియోగం గతంలో కంటే భారీగా తగ్గింది. ఇందుకు కారణంగా చాలా స్కూళ్లకు రన్నింగ్ వాటర్ నిలిచిపోవడం, క్లీనింగ్‌ను నిర్లక్ష్యం చేస్తుండడమే. టాయిలెట్ల క్లీనింగ్‌కు రసాయనాలను ఇటీవలే సరఫరా చేసినా మండలాలకు చేరలేదు.

ఇంటి నుంచి పప్పు తెచ్చుకుంటాం



పాఠశాలలో ఒక్కోసారి వంట బాగుండదు. అందుకని ఇంటి నుంచి అప్పుడప్పుడు పప్పు తెచ్చుకుంటాం. అలాగే కొంత మంది విద్యార్థులు భోజనం కూడా తెచ్చుకుంటున్నారు. పాఠశాలలో భోజనం బాగాలేని రోజు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను మరింత మెరుగు పరచాలి. – శివ, 10వ తరగతి, మద్దికెర

హిందీ సబ్జెక్టుకు ఉపాధ్యాయులు లేరు



మా పాఠశాలలో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉంది. 8 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఒకటి, రెండు తరగతులకు ఇద్దరు టీచర్లు ఉండగా 3నుంచి 9వ తరగతులకు 6 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఉన్న వారిలో హిందీ ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

– సత్య కరుణ, ప్రధానోపాధ్యాయురాలు, హనుమాపురం

బోధన.. వేదన

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంతో పాటు, 3,4 కేటగిరిలకు చెందిన స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత ఉంది. 2014 ఏప్రిల్ నుంచి 2019 మార్చి వరకు పదవీ విరమణ పొందే 608 టీచర్ పోస్టులకు మాత్రమే 2018 డీఎస్సీ నోటిఫికేషన్‌తో అప్పటి టీడీపీ ప్రభుత్వం సరిపెట్టింది. ఎలాంటి ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా వెళ్లిపోగా, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 608 పోస్టులతో పాటు, 2008 డీఎస్సీ అభ్యర్థులతో 209 పోస్టులు, 1998 డీఎస్సీ అభ్యర్థులతో 204 పోస్టులను భర్తీ చేసింది. దీంతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో పోస్టులు మంజూరై ఆ జిల్లాలకు అవసరం లేని 1,873 పోస్టులను ఈ జిల్లాకు బదలాయించారు. విద్యాశాఖ గణాంకాల ప్రకారం ప్రస్తుతం జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 1,702, ఎస్‌జీటీలు 1,360 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. టీచర్ల కొరత ఉన్నప్పటికీ జిల్లాలో 256 మంది టీచర్లను సర్దుబాటు చేశారు.

సాక్షి పరిశీలనలో..

- ఆదోని నియోజకవర్గంలో మొత్తం 126 పాఠశాలలు ఉండగా 60 పాఠశాలల్లో వంట నిర్వాహకులను మార్చేశారు. 250 మంది ఉపాధ్యాయులు అవసరం ఉంది. ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో 960 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడ ముగ్గురిని సర్దుబాటు చేసినా బోధన సమస్య నెలకొంది. పట్టణంలోని కల్లుబావి పురపాలక ప్రాథమిక పాఠశాల, కిలిచిన పేట పురపాలక ఉన్నత పాఠశాల, పెద్దతుంబళం ఎస్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాల, పెసలబండ ప్రాథమికోన్నత పాఠశాల, నాగనాథనహాళ్లి ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత నెలకొంది.
- కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు రూరల్ మండలాల్లో మొత్తం 203 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. చాలా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ లేక మూతపడటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కోడుమూరు మండలం ప్యాలకుర్తి స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకులను, హైస్కూల్లోను క్లీనింగ్ సిబ్బందిలో ఒకరిని రాజకీయ కారణాలతో తొలగించారు. సి.బెళగల్ మండలంలో 9 స్కూళ్లలో వంట ఏజెన్సీలను మార్చేశారు. కర్నూలు మండలం పూడూరు ప్రభుత్వ పాఠశాలలో రెండు వంట ఏజెన్సీలు, పంచలింగాల 1, దిన్నెదేవరపాడు గ్రామంలో ఒక వంట ఏజెన్సీని రాజకీయ కారణాలతో మార్చారు.
- ఎమ్మిగనూరు మండల పరిధిలోని కందనాతి గ్రామ ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపీపీ డిపెప్ స్కూల్లో 1 నుంచి 5వ తరగతి వరకు 102 మంది విద్యార్థులు చదువుకుంటుండగా ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. కాగా ఈ సంవత్సరం జనవరి నుంచి ఒకరు ప్రమోషన్‌కు అవసరమైన ఉన్నత చదువుల కోసం సెలవులో వెళ్లారు. అప్పటి నుంచి ఒక్క పాధ్యాయుడు బోధన చేస్తున్నారు.
- మంత్రాలయం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ గాడి తప్పింది. పిల్లలు తినడం లేదనే సాకుతో వంట ఏజెన్సీలు మెనూలో కోతలు పెడుతున్నారు. చాలా చోట్ల ఉడకని అన్నం, నీళ్ల సాంబారు, తూతూ మంత్రంగా రాగి మాల్ట్ అందజేస్తున్నారు. కొందరు విద్యార్థులు ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుని భోజనాలు కానిస్తున్నారు. 346 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



కోసిగి బాలుర పాఠశాలలో నీటి సరఫరా లేకపోవడంతో మూతబడిన టాయిలెట్లు



జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూతపడిన వాటర్ ప్లాంట్

- ఆలూరు నియోజకవర్గంలోని మండలాల్లో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉంది. చిక్కీలు నాణ్యత లేకపోవడం, కోడి గుడ్లు సైజు చిన్నగా ఉంటున్నాయి. 294 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది.
- పత్తికొండ నియోజకవర్గంలోని మండలాల్లో 103 స్కూళ్లలో వంట ఏజెన్సీలు, 12 మంది నైట్ వాచ్‌మెన్లు, 80 మంది అయాలను మార్పు చేశారు. నియోజకవర్గంలో 112 మంది సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది.
- కర్నూలు నియోజకవర్గంలో 65 పాఠశాలల్లో 66 మంది సబ్జెక్టు టీచర్లు లేరు. వాస్తవానికి విద్యార్థుల సంఖ్య ఆధారంగా 226 మంది టీచర్లు కావాల్సి ఉంది. మధ్యాహ్న భోజనంలో వాడే బియ్యం నాణ్యత ఉండక పోవడం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో మోను సక్రమంగా అమలు కావడం లేదు.

విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి కృషి

- ఏపీఈఆర్‌సీ చైర్మన్ నాగార్జున రెడ్డి

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తామని ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి అన్నారు. నగర శివారులోని విద్యుత్ నియంత్రణ మండలి కర్నూలు కార్యాలయంలో సోమవారం 10వ రాష్ట్ర విద్యుత్ సమన్వయ ఫోరం సమావేశాన్ని చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో 2024-25 నుంచి 2028-29 వరకు అమలు చేయనున్న విద్యుత్ ప్రణాళికపై చర్చ జరిగింది. రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ రాష్ట్ర విద్యుత్ ప్రణాళికను, ముఖ్య ఉద్దేశాలు, లక్ష్యాలను కమిటీకి వివరించారు. చైర్మన్ మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలోని ముఖ్య అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని అవసరమైన మార్పులు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రణాళికపై కొత్త సమీకృత స్వచ్ఛ ఇంధన పాలసీ ప్రభావం ఉంటుందని, దీంతో ప్రస్తుత ప్రణాళికను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే విద్యుత్ పరికరాల అంచనా వ్యయాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని అదుపు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో విద్యుత్ నియంత్రణ మండలి తరఫున ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. సంస్థల సీఎండీలు రవి పట్టాన్‌శెట్టి, సంతోషరావు, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి పాల్గొన్నారు.



వెల్లువలా వినతులు

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పోటెత్తిన జనం
- 500కు పైగా అర్జీలు దాఖలు
- పెన్షన్లు, ఇళ్ల మంజూరుకు అత్యధిక వినతులు

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. ఈనెల 14వ తేదీన పల్లె పండుగ వారోత్సవాల ప్రారంభం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించలేదు. దీంతో సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యలపరిష్కార వేదికకు ప్రజలు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్యకు అర్జీలు అందజేశారు. 500కు పైగా వినతులు రాగా అందులో ఎక్కువగా పెన్షన్లు, ఇళ్ల మంజూరు, రెవెన్యూ అంశాలపై ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...వారంలో 36 అర్జీలు రీఓపెన్ అయినట్లు చెప్పారు. రీఓపెన్ అయిన అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన 30 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా మొదటి ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చిరంజీవి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

వినతుల్లో కొన్ని..

- ఇటీవల తన భార్య చనిపోయిందని, తాను కూడా కాలమైతే ఒక్కగానొక్క కుమారుడి ఈశ్వర్ పరిస్థితి ఆలోచిస్తే భయమేస్తుందని, ఏదైన హాస్టల్‌లో సీటు ఇప్పిస్తే చదివిస్తానని నన్నూరుకు చెందిన ఏసన్న కలెక్టర్‌కు వినతం పత్రం అందజేశారు.
- జాతీయ రహదారి నుంచి లక్ష్మీపురం వెళ్లే రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకోవాలని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వైన్ షాప్ ఏర్పాటు చేస్తున్న స్థలానికి సమీపంలో కేజీబీవీ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, మసీదు ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.
- కర్నూలు నుంచి దిన్నెదేవరపాడు వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, మోకాలి లోతు గుంతలు ఉన్నాయని, వర్షం కురిసి నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే మరమ్మతులు చేయించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిటికెల శామ్యూల్ కలెక్టర్‌ను అభ్యర్థించారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

కర్నూలు (టౌన్): విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు. స్మృతి పరేడ్‌కు హాజరైన వారు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పోలీసు అమర వీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసులను స్మరిస్తూ ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించడం జరుగుతుందన్నారు. పోలీసు శాఖలో పనిచేయడం చాలా కష్టమని, 24 గంటలూ ఈ విభాగంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడటంలో ముందుండే పోలీసులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఎటువంటి సమస్యలున్నా, సహాయం కావాలన్నా తెలియజేస్తే అండగా ఉంటామన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి మాట్లాడుతూ మనకు రక్షణ కల్పిస్తూ ప్రాణాలు కోల్పోయిన పోలీసు అధికారుల ధైర్య సాహసాలు, దేశభక్తి, విధేయతలను గుర్తుంచుకుని గౌరవిద్దామన్నారు. పోలీసుల త్యాగాలు రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తుందన్నారు.



అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్, ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, జేసీ నవ్య తదితరులు



అమర వీరుల కుటుంబీకులను సన్మానిస్తున్న దృశ్యం

జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న భారత్, చైనా సరిహద్దు లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్ వద్ద పోలీసు పెట్రోలింగ్ పహారాలో ఉన్న పది మంది సీఆర్‌పీఎస్ జవాన్లపై శత్రువులు దాడి చేశారని, ధైర్య సాహసాలతో వారిపై ప్రతి దాడిచేస్తూ వీర మరణం పొందారన్నారు. ఆరోజు చేసిన త్యాగాలను గుర్తించి దేశ వ్యాప్తంగా అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అమరవీరుల కుటుంబాలను కలెక్టర్, జడ్జి, ఎస్పీ శాలువతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు బాబుప్రసాద్, శ్రీనివాసాచారి, శ్రీనివాసరావు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

కేఎంసీలో ర్యాగింగ్ కలకలం!

- మీసాలు, గెడ్డాలు పెంచుకోవద్దు... బూట్లు వేసుకోవద్దు
- మేం చెప్పిన యాప్‌లే డౌన్‌లోడ్ చేసుకోవాలి
- జూనియర్లను వేధిస్తున్న సీనియర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం సృష్టించింది. ఇటీవల కళాశాలలో చేరిన జూనియర్ (ఫ్రెషర్స్)ను సీనియర్లు వేధించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని బాధిత విద్యార్థులు కొందరు తమ తల్లిదండ్రుల ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. దీనిపై అధికారులు అంతర్గతంగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. కర్నూలు మెడికల్ కాలేజీలో ఈ నెల 14వ తేదీ నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. తరగతి గదుల్లోకి కొందరు సీనియర్ విద్యార్థులు గుంపులుగా వచ్చి ర్యాగింగ్ చేస్తున్నట్లు సమాచారం. 'జూనియర్ విద్యార్థులు బూట్లు వేసుకురాకూడదు. మీసాలు, గెడ్డాలు పెంచుకోవద్దు. మేం చెప్పిన యాప్‌లనే స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. మేము చెప్పినట్లు నడుచుకోవాలి...' అని వివిధ రకాలుగా బెదిరించినట్లు తెలిసింది. కళాశాలలోని హాస్టల్‌లో సైతం మెస్‌కు వెళ్లి తమకు భోజనం తీసుకురావాలని, ప్లేట్లు కడగాలని హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం. కొందరు సీనియర్ వైద్య విద్యార్థులు హాస్టల్‌లోనే సిగరెట్లు, మద్యం తాగుతున్నారని తెలిసింది. ఈ విషయాలపై విచారణ చేసేందుకు అధికారులు హాస్టల్ గేటు వద్దకు వెళ్లగానే వారికి సమాచారం అందుతుందని, అప్రమత్తం అవుతున్నారని తెలుస్తోంది.



కర్నూలు మెడికల్ కళాశాల

క్లుప్తంగా

బైర్లూటి సమీపంలో పెద్దపులి !



ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిలో పెద్దపులి సంచరిస్తుంది. ఆ మార్గంలో వెళ్లే కొందరు వాహనదారులు పులి సంచార దృశ్యాన్ని గమనించి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. ఇటీవల ఆత్మకూరు మండలంలోని వరదరాజస్వామి ప్రాజెక్టు సమీపంలో పులి కనిపించిన విషయం తెలిసిందే. తాజాగా కేజీ రహదారిపై పెద్దపులి సంచరిస్తున్న దృశ్యాలు బయటపడటంతో చుట్టుపక్కల గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శిరివెళ్ల: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. అనంతరపురం జిల్లా తాడిపత్రి నుంచి శిరివెళ్లకు ఇసుక ట్రాక్టర్ వస్తుండంగా దాడి చేసి పట్టుకున్నారు. ట్రాక్టర్‌లో 7 టన్నుల ఇసుక ఉంది. మార్కెట్‌లో రూ.9 వేల నుంచి రూ.10 వేలకు ఇసుకను విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ రామాజీని తహసీల్దార్ పుష్పకుమారి ఎదుట హాజరు పరచగా రూ.5 వేల జరిమానా విధించారు.

బాల్య వివాహాలు నేరం

కర్నూలు న్యూసిటీ : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని డీసీపీఓ శారద అన్నారు. ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి ఆదేశాల మేరకు సోమవారం సి. బెళగల్ మండలం కంబదహాల్, కర్నూలు మండలం గొందిపర్ల గ్రామాల్లో జరుగుతున్న బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. చిన్న వయస్సులో పెళ్లిలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

పిన్నిని తిట్టొద్దన్నందుకు దాడి

ఎమ్మిగనూరురూరల్: పిన్నిని తిట్టొద్దన్నందుకు వ్యక్తిపై కొడవలితో దాడిచేసిన ఘటన సోమవారం రాత్రి మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రాజు అనే వ్యక్తి మద్యం సేవించి తన భార్యను తిడుతూ కొట్టడానికి వెళ్తుండగా.. ఇంటి పక్కనే ఉన్న బంధువు అజయ్‌కుమార్ పిన్నిని ఎందుకు తిడుతున్నావని అడ్డుచెప్పాడు. దీంతో రాజు ఒక్కసారిగా పక్కనే ఉన్న కొడవలితో అజయ్‌కుమార్‌పై దాడి చేయటంతో తలకు, చేతి వేళ్లకు గాయాలయ్యాయి. అడ్డువచ్చిన నాగేష్‌కు కూడా గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు ప్రభుత్వాసుపత్రికి చేరుకొని అజయ్‌కుమార్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కృష్ణగిరి: మండలంలోని పులిచెర్ల గ్రామం వద్ద రైల్వే ట్రాక్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు డోన్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వారం, పదిరోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండవచ్చని రైల్వే పోలీసులు పేర్కొన్నారు. మృతుడి వయసు 49 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండవచ్చని తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని డోన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గవిగట్ల వద్ద చిరుత

పెద్దకడుబూరు : మండల పరిధిలోని గవిగట్టు గ్రామాన్ని అనుకొని ఉన్న కొండల్లో సోమవారం ఉదయం చిరుతపులి కనిపించింది. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కొన్ని రోజులుగా ఆ చిరుత ఆ ప్రాంతంలోనే సంచరిస్తుంది. గతంలో గవిగట్టు గ్రామానికి చెందిన గొర్రెలను తిన్న విషయం తెలిసిందే. మళ్లీ అలాంటి పరిస్థితి రాకముందే ఫారెస్టు అధికారులు కొండ నుంచి ఆ చిరుతను తరమాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ఇసుక లేదు.. ఉపాధి లేదు!

- కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

ఉచిత ఇసుక పేరుతో చంద్రబాబునాయుడు ప్రభుత్వం చేసిన మోసంతో భవన నిర్మాణ కార్మికులు పని లేక ఆకలితో అలమటిస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు కలిసి ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక ఇవ్వాల్సిందేనన్నారు. గతంలో కంటే ప్రస్తుతమే ఇసుక ధరలు అధికంగా ఉండడంతో భవన నిర్మాణ యజమానులు పనులు చేయించ లేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా నిర్మాణ రంగంపైనే ఆధారపడి జీవనం చేసే కార్మికులకు ఉపాధి దొరకడం లేదన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, రాముడు, నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు. – కర్నూలు(సెంట్రల్)

బాబూ..రూ.10 వేల హామీ ఏమైంది

- కూటమి ప్రభుత్వ మోసంపై కదం తొక్కిన వలంటీర్లు

వలంటీర్ వ్యవస్థను కొనసాగించడంతో పాటు రూ. 10 వేల వేతనం ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోకపోవడంతో వలంటీర్లు రోడ్డెక్కారు. తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేసి తమను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాజ్‌విహార్‌లోని అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏపీ వలంటీర్ అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.60 లక్షల వలంటీర్లు, వారి కుటుంబాల ఓట్ల కోసం బాబు మాయమాటలు చెప్పారన్నారు. నమ్మి ఓటేస్తే రూ. 10 వేల వేతనం ఇవ్వకపోగా ఇప్పటి వరకు విధుల్లోకి తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఉపాధ్యక్షుడు శరత‌కుమార్ పాల్గొని మద్దతు తెలిపారు. – కర్నూలు(సెంట్రల్)





డీఎస్సీలో పోస్టులే లేనప్పుడు టెట్ ఎందుకు

- సర్కారు తీరుపై స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల నిరసన

కూటమి సర్కారు మెగా డీఎస్సీ పేరుతో ప్రకటించిన 16 వేల పోస్టుల్లో స్పెషల్ టీచర్ పోస్టు ఒక్కటి కూడా లేదు. అలాంటప్పుడు తమకు టెట్ ఎందుకు నిర్వహిస్తున్నారో చెప్పాలని స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులు పాలకులను డిమాండ్ చేశారు. సోమవారం డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలోని అయాన్ డిజిటల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన టెట్ కేంద్రంలో పరీక్షలు ముగిసిన అనంతరం ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ ప్రత్యేక ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి కొండా లోకేష్ రావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించేందుకు స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు చదివిన వారినే ఉపాధ్యాయులుగా నియమించాలని సుప్రీం కోర్టు ఆదేశాలున్నా ఏపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సొసైటీ ఫర్ వర్కింగ్ ఎడ్యుకేషన్ హ్యూమన్ యాక్టివిటీస్ ఫౌండర్ శ్వేత నిరుద్యోగుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. – కర్నూలు సిటీ

ఇదేంది స్వామి!

- శ్రీశైల దేవస్థానం పాలన అస్తవ్యస్తం
- నిబంధనలకు విరుద్ధంగా ఇన్‌చార్జ్ ఈఓ నియామకం
- డీసీని కాదని ఏసీకి బాధ్యతలు
- సాధారణ బదిలీల్లో నలుగురు ఏఈఓలకు స్థాన చలనం
- ఆ స్థానంలో ఒక్కరినీ నియమించిన వైనం
- చర్చనీయాంశంగా మారిన దేవదాయ శాఖ ఉన్నతాధికారుల తీరు



శ్రీశైలంటెంపుల్: సాధారణంగా ఏ ప్రభుత్వ శాఖలో అయినా ఉన్నతాధికారి బదిలీ అయితే తరువాత స్థానంలో ఉన్న అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తారు. అయితే, కూటమి ప్రభుత్వంలో అందుకు విరుద్ధంగా కిందిస్థాయి అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. శ్రీశైల దేవస్థానం ఈఓ బదిలీ సమయంలో జారీ అయిన ఈ ఉత్తర్వులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం తరువాత అతిపెద్ద పుణ్యక్షేత్రాల్లో శ్రీశైల దేవస్థానం ఒకటి. అలాంటి ఈక్షేత్రంలో ప్రస్తుతం పాలన అస్తవ్యస్తంగా మరింది. భక్తుల సౌకర్యాల విషయాన్ని పట్టించుకునే వారు లేరు. ఈఓ(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)గా విధులు నిర్వహిస్తున్న డి.పెద్దిరాజును ఈ నెల 18న రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇంకా కొత్తవారిని నియమించలేదు. అయితే, ఇన్‌చార్జ్ ఈఓగా దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇ.చంద్రశేఖరరెడ్డికి బాధ్యతలు కేటాయిస్తూ దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణంగా ప్రధాన దేవాలయాల్లో ఉప కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కమిషనర్ (డీసీ) వ్యవహరిస్తారు. ఈఓ సెలవుల్లో వెళ్లినప్పుడు డీసీనే ఇన్‌చార్జ్ ఈఓగా ఉంటారు. శ్రీశైల దేవస్థానంలోనూ డీసీ స్థాయి అధికారే డీఈఓ గా విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఈఓ బదిలీ అయితే డీఈఓకు ఇన్‌చార్జ్ ఇవ్వాలి. అయితే ఇక్కడ డిప్యూటీ ఈఓ ఆర్. రమణమ్మను కాదని అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)గా పనిచేస్తున్న ఇ.చంద్రశేఖరరెడ్డికి ఇన్‌చార్జ్ ఈఓ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పై స్థాయి అధికారి ఉంటే కిందిస్థాయి అధికారికి ఇన్‌చార్జి ఇవ్వడమేంటని అధికారులు చర్చించుకుంటున్నారు. ఈ ఉత్తర్వుల జారీలో రాష్ట్ర దేవదాయశాఖ కార్యాలయ అధికారుల తప్పిదమా? లేక శ్రీశైలంలో డీసీ స్థాయి అధికారి ఉన్నా కూటమి నాయకుల ఒత్తిడితో ఏసీకి బాధ్యతలు అప్పగించారా అన్న చర్చ కొనసాగుతోంది.




దేవస్థాన పరిపాలన భవనం

బదిలీ ఏఈఓల స్థానాలు ఖాళీ

రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైల దేవస్థానంపై చిన్నచూపు చూస్తుంది. ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో క్షేత్రంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులను బదిలీ చేసింది. ఇందులో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులతో పాటు, పూర్తికాని వారు సైతం ఉన్నారు. క్షేత్రంలో అన్నదానం, వసతి, గోశాల, ఆలయం, పారిశుద్ధ్య, రెవెన్యూ విభాగాలకు సహాయ కార్యనిర్వహణాధికారులు (ఏఈఓలు) ఉంటారు. అయితే క్షేత్రం నుంచి ఒకేసారి నలుగురు ఏఈఓలు బదిలీ అయ్యారు. పారిశుద్ధ్య విభాగం ఏఈఓ మాత్రమే మిగిలారు. ఆయన కూడా ఇటీవల అవినీతి ఆరోపణలతో సస్పెండ్‌కు గురయ్యాడు. దీంతో ప్రస్తుతం ఇక్కడ ఒక్క ఏఈఓ లేడు. ఇక్కడి నుంచి నలుగురిని బదిలీ చేసిన దేవదాయశాఖ, వారి స్థానంలో ఎవరినీ నియమించలేదు. శ్రీశైలం నుంచి 22మంది ఉద్యోగు లను ఇతర దేవస్థానాలకు బదిలీ చేశారు. వీరి స్థానంలో ఇతర దేవస్థానాల నుంచి ఒక పర్యవేక్షకుడు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు తప్ప ఎవరినీ కేటాయించలేదు. దీంతో క్షేత్రంలో పర్యవేక్షణ కొరవడింది.

మల్లన్న సేవలో సినీ నిర్మాత దిల్ రాజు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను సోమవారం సినీ నిర్మాత దిల్ రాజు దర్శించుకున్నారు. మల్లికార్జున స్వామి వారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..నాగలదిన్నె గ్రామానికి చెందిన ఉరుకుందు మద్యానికి బానిసయ్యాడు. గత రెండు రోజుల క్రితం స్ఫూర్తి ఫైనాన్స్‌లో రూ.40 వేలు లోన్ తీసుకున్నాడు. అందులో రూ.20,000 ఇంట్లో ఇవ్వగా, మరో రూ.20 వేలు మద్యం తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఉరుకుందును మందలించారు. దీంతో మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతిడికి భార్య సావిత్రితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

ఆదోని అర్బన్: నకిలీ ఆధార్‌తో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగిన ఘటనలో ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు తెలిపారు. ఆధార్‌కార్డు ఫోర్జరీ చేసి తమ ఆస్తిని అక్రమంగా రిజిస్టర్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు రాజశేఖర్, హరిబాబు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డెంటల్ డాక్టర్ రవికిరణ్, జె.లక్ష్మి, చిప్పల సురేష్‌బాబు, సాక్షులు చంద్రప్ప, రవికుమార్, డాక్యుమెంట్ రైటర్ రవిలపై 420, 468 సెక్షన్ల కింద చీటింగ్, ఫోర్జరీ కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉంటే ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ హాజీమియ్యా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాను ఈనెల 16వ తేది సెలవులో ఉన్నానని, ఆరోజు నకిలీ ఆధార్‌తో రిజిస్ట్రేషన్ జరిగిందని , రెండు రోజుల తర్వాత బాధితులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే ఈ విషయం జిల్లా సబ్‌రిజిస్ట్రార్‌కు తెలియజేసి సోమవారం డాక్యుమెంట్ రద్దు చేశానని వెల్లడించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఆదోని అర్బన్: స్థానిక శ్రీనగర్ కాలనీకి చెందిన మైమునాబేగం(40) విద్యుదాఘాతంతో సోమవారం మృతిచెందింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. మైమునాబేగం సాయంత్రం అదే కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి క్యూరింగ్ చేయడానికి వెళ్లింది. మోటార్ ఆన్ చేసే సమయంలో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడిపోయింది. స్థానికులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త నిస్సార్ అహ్మద్ తోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం



ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ బిందుమాధవ్

- న్యాయం చేయాలని ఎస్పీని ఆశ్రయించిన బాధితులు
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 100 వినతులు

కర్నూలు (టౌన్): ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేశారని పలువురు బాధితులు లిఖితపూర్వకంగా జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు అందజేశారు. సోమవారం స్థానిక రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నుంచి వంద మంది ఫిర్యాదుదారులు తమ అర్జీలను నేరుగా ఎస్పీని కలిసి అందజేశారు. అర్జీలను సమగ్రంగా విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ బాధితులకు హామీ ఇచ్చారు. లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

➡ నా కుమార్తె కేశమ్మ ఎంబీఏ పూర్తిచేసింది. ఆల్ఫా బీట్ గ్రూప్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నమ్మించి రూ.4 లక్షలు తీసుకున్నారు. నకిలీ ఆర్డర్ కాపీ ఇచ్చి మోసం చేసిన అనంతపురానికి చెందిన సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని గూడూరు మండలం గుడిపాడుకు చెందిన రైతు దుబ్బన్న ఫిర్యాదు చేశారు.

➡ కర్నూలు ఫుడ్ కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.3.50 లక్షలు తీసుకుని నెలకు రూ.30 వేలు జీతం వస్తుందని చెప్పి కర్నూలుకు చెందిన అయేషాబాను డబ్బులు తీసుకుని మోసం చేసిందని కర్నూలుకు చెందిన వినయ్ గౌడ్ ఫిర్యాదు చేశారు.

➡ తాను అనంతపురంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నానని, ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన కార్తీక్ అనే వ్యక్తి రూ.7 లక్షలు తీసుకుని మోసం చేశాడని గూడూరు మండలం నాగలాపురం గ్రామానికి చెందిన సలీమా ఫిర్యాదు చేశారు.

➡ తాను డిగ్రీ పూర్తి చేశానని, నిరుద్యోగిగా ఉన్న తనకు హైదరాబాదులో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.3.90 లక్షలు తీసుకుని మోసం చేసిన కర్నూలుకు చెందిన బూమపోగు శ్రేయాస్ అనే వ్యక్తిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కర్నూలుకు చెందిన షేక్ సల్మాన్ ఫిర్యాదు చేశారు.

➡ నదీ తీర ప్రాంతాల పోర్టుల్లో థర్డ్ ఆఫీసర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలుకు చెందిన వై.నాగేశ్వరరావు రూ.7 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఆదోనికి చెందిన ప్రవీణ్ ఫిర్యాదు చేశారు.

➡ అత్తామామలు కుటుంబ అవసరాల కోసం తన వద్ద బంగారం తీసుకుని ఇప్పుడు లేదంటున్నారని, తనకు న్యాయం చేయాలని పసుపల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు.

➡ తనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడికి కంటిచూపు సరిగ్గా లేదు. పెద్ద కుమారుడు వెంకటేశ్వర ఆచారి తనకు వచ్చిన ఇంటిని తీసుకుని బాగోగులు చూడకుండా భిక్షాటన చేయిస్తున్నాడని కర్నూలుకు చెందిన మునెమ్మ ఫిర్యాదు చేశారు.

29 నుంచి సమ్మెలోకి వెళ్తాం

కర్నూలు(హాస్పిటల్): సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 29వ తేది నుంచి సమ్మెలోకి వెళ్తామని ఏపీ వైద్యమిత్ర కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌లకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 17 సంవత్సరాలుగా తాము ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. పనికితగ్గట్లు ఫీల్డ్ సిబ్బందికి న్యాయం జరగడం లేదన్నారు. అందరికీ కాలానుగుణంగా మార్పులు వస్తున్నప్పటికీ వైద్యమిత్రలు మాత్రం చాలీచాలని జీతాలతో బతుకులు గడుపుతున్నారని ఆవేదన వ్యక చేశారు. కూటమి ప్రభుత్వం ఆలోచించి తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో వైద్యమిత్రలు దేవేందర్‌నాయక్, సి. కంబగిరి, జయూబ్, విజయ్‌కుమార్, రాఘవేంద్ర, మల్లికార్జునరావు, సుధాకర్‌బాబు, రాజారమేష్ తదితరులు ఉన్నారు.



సమ్మెలోకి వెళ్తున్నట్లు కలెక్టర్ కలిసి తెలియజేసిన వైద్యమిత్రలు

పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం

- అకారణంగా ఎస్‌ఐ కొట్టాడని కుటుంబ సభ్యుల ఆరోపణ

పాణ్యం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని రసూళ్లపేటకు చెందిన గంగమ్మ, వెంకటసుబ్బయ్య కుమారుడు జనార్దన్, అదే గ్రామానికి చెందిన యువతికి సంబంధించిన ప్రేమ వ్యవహారం ఏడాది క్రితం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. అయితే అప్పట్లో పోలీసుల సమక్షంలో ఇరుకుటుంబాల పెద్దలు.. ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పంచాయతీ చేశారు. అనంతరం యువతిని కుటుంబ సభ్యులు బంధువుల ఊళ్లో వదిలారు. ఈక్రమంలో కొత్తగా వచ్చిన ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి.. జనార్దన్‌ను పోలీసు స్టేషన్‌కు రావాలని ఆదేశించడంతో.. అతడు తన తండ్రి వెంకటసుబ్బయ్య, సోదరుడు నరేష్‌తో కలిసి వెళ్లాడు. ఎలాంటి విచారణ చేయకుండానే జనార్దన్‌ను ఎస్‌ఐ అకారణంగా కొట్టాడు. దీంతో అతడు తీవ్ర మనస్తానికి గురై బయటకు వెళ్లి పురుగు మందు డబ్బాతో మళ్లీ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అక్కడే పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమ కుమారుడిని అకారణంగా చితకబాదిన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని యువకుడి తండ్రి డిమాండ్ చేశాడు. ఈ విషయమై సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా యువకుడిని పోలీసులు కొట్టలేదని, స్టేషన్ బయట పురుగు మందు తాగాడని, పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని చెప్పారు.



చికిత్స పొందుతున్న జనార్దన్



కోసిగి నుంచి టెంపోలో వెళ్తున్న కూలీలు



కోసిగిలో ట్రాక్టర్‌లో పిల్లలతో కలిసి వెళ్లుతున్న కూలీలు



పెద్దకడబూరులో వలస వెళ్లడానికి చిన్న పిల్లలను టెంపోలో ఎక్కిస్తున్న దృశ్యం

ఊరెళ్లి పోతోంది!

- ఉపాధి కరువై వలస వెళ్తున్న కూలీలు

పల్లెలు వలస బాట పట్టాయి. స్థానికంగా పనులు లేక కొందరు.. పంటలు పండక మరికొందరు పొట్ట చేతబట్టుకుని సొంతూర్లు వదిలిపోతున్నారు. పిల్లలను ముసలివాళ్లకు అప్పగించి మళ్లీ వస్తామంటూ ప్రయాణమవుతున్నారు. కరువు ప్రాంతమైన ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల నుంచి ప్రతిరోజూ వందలాది కుటుంబాలు మూటముల్లె సర్దుకుని వాహనాల్లో పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు వెళ్తున్నారు. అక్కడ పొలాల్లో, పరిశ్రమల్లో ఏదో పని చేసి బతుకవచ్చనే ఆశతో సుగ్గిబాట పట్టినట్లు కూలీలు చెబుతున్నారు. – పెద్దకడబూరు/కోసిగి/గోనెగండ్ల

